సి. ఆనందారామం

# భార్యా రూపవతీ శత్రుః

అరుణ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది.

"డియర్ కోమలీ!

నా మనసుకి చాలా చిరాకుగా ఉంది. నీ దగ్గిరికి వచ్చేస్తున్నాను. ఎందుకని– ఎప్పుడని– ఎన్నాళ్ళుంటావని అడగకు. ఎందుకో నీకు చెప్పినా అర్థంకాదు. ఎప్పుడొస్తానో నాకే తెలియదు. అక్కడికి వచ్చాక కానీ, ఎన్నాళ్ళుంటానో చెప్పలేను.

నీ.

అరుణ..."

ఉత్తరం చదవటం పూర్తిచెయ్యగానే నాకు మతిపోయినట్లయింది. అరుణ ఇక్కడకు రావటమా? వద్దు! వద్దు!. అదిక్కడకి రావడానికి వీల్లేదని వ్రాసేస్తాను. 'నిన్ను నేను భరించలేను. వడగళ్ళలాంటి దానివి. చల్లగా ఉంటూనే భరింపలేని దెబ్బ తగిలిస్తావు. కాకోదర శిరోరత్నానివి. ధగద్ధగాయమానంగా, కాంతులీనుతూనే ప్రాణాపాయానికి దారి తీస్తావు. నీ ఆకర్షణ ప్రమాదకరమైనది. నీ చూపులముందు ఎలాంటి నిషాద్రవ్యమైనా దిగదుడుపే! నీ మాటలలో అయస్కాంత శక్తి ఉంది. నీ శరీరం శిల్పులకు మోడల్. నీ మనసు కాలకూట విషాన్నీ, దివ్యామృతాన్నీ ఒకే క్షణంలో క్రుమ్మరించగల విచిత్రమైన వస్తువు. వద్దు! రావద్దు! అని వ్రాసెయ్యాలనుకున్నాను. కానీ, ఏమీ వ్రాయలేకపోయాను. దాని మాటను కాదనే శక్తి నాకు లేదు. ఒకప్పుడు నేనూ దాని వ్యక్తిత్వపు నీడలో ఆడుకున్నదానినే! దాని ప్రతి మాటకూ పకపకనవ్వుతూ, దాని ప్రతి చేష్టకూ తాళం వేసిన దాన్నే! మా కందరికీ దాని సాంగత్యంలో కాలం క్షణాలమీద గడిచిపోయేది. అది లేకపోతే మా కెవ్వరికీ తోచేదికాదు. మాలో అసలు జీవమే లేనట్లుండేది. ఇప్పటికి రెండేళ్ళక్రితం – అంటే, నాకు పెళ్ళి

కాకముందు ఈ ఉత్తరం వచ్చివుంటే, సంతోషంతో ఉక్కిరిబిక్కిరయేదానిని. అదెప్పు డెప్పుడు వస్తుందా, అని క్షణాలు లెక్కపెట్టే దానిని. కానీ ఇప్పుడు అది వస్తుందనే భావన నా మనసులో మంటలు రేపుతూంది. అసలే ఈయన అగ్ని. దానికి వాయువులాగ ఈ అరుణ తోడైతే, నే నెక్కడ నిలుస్తాను ?

ఆరోజు...నాకు బాగా గుర్తు. ఎంతో భయంభయంగా అతి కష్టంమీద వంచిన తల ఎత్తాను. మెరుస్తూన్న అల్లరి కళ్ళు కనిపించాయి.. నన్ను నేను మరచిపోయాను. నా మైమరపును గమనించిన ఆ పెదవులు చిలిపిగా నవ్వాయి. గుండెలు ఝల్లుమన్నాయి. ఆపాదమస్తకమూ కదలిపోయాను. నా పెదవులు నాకు తెలియకుండానే సిగ్గుగా నవ్వేశాయి. తల వంగిపోయింది. ఆ తరువాత ఏం జరిగిందో నాకే తెలియదు. నా సమస్త చైతన్యాన్నీ, ఆ చిలిపి చిఱునవ్వూ, ఆ అల్లరి కళ్ళూ ఆక్రమించేసుకున్నాయి. కట్నం తీసుకునేవాళ్ళని పెళ్ళి చేసుకోనని పట్టుబట్టిన నేను, ఆయన పక్కా వ్యాపారిలా బేరాలాడినా కూడా ఎలా సహించానో ! సమిష్టి కుటుంబంలో బాధ్యతలు భరించలే ననేదాన్ని, అత్తగారూ, మావగారూ, పినమావగారూ, ఇద్ద రాడబిడ్డలూ, ఇద్దరు మఱదులూ ఉన్న కుటుంబంలోకి కోడలిగా అడుగు పెట్టడానికి ఎలా అంగీకరించానో! వీటి కన్నింటికీ సమాధానం ఒక్కటే ! — ఆ చిరునవ్వు —.


మధురమైన సన్నాయి వాయిద్యాల మధ్య, బంగారు కలలు కళ్ళలో నింపుకుని, వల్లమాలిన మమత మనసులో పండించుకుని జీవితంలోకి అడుగు పెట్టాను.

నా కళ్ళలోకి చూస్తున్న ఆ అల్లరి కళ్ళలోని అందాలు నా గుండెల్లో నింపుకున్నాను. నా మనసులో తిరిగి తిరిగి ప్రతిఫలించే ఆ చిరునవ్వులో నా ఊపిరి రంగరించుకున్నాను. చిన్న కనుబొమ కదలికతో చుట్టుప్రక్కల వారిని శాసించే ఆ ధీర వ్యక్తిత్వం ముందు, నా జీవితం సంపూర్ణంగా పఱచి, అహాన్ని పూర్తిగా మఱచిపోయాను.

ఈ అద్భుత స్వర్గం 'నాది' అని అనుకునీ అనుకోకముందే, ఆ స్వర్గంలో ఒక భాగంగా లీనమయి, ఘోరనరకం కూడా అనుభవంలోకి వచ్చేసింది.

ఈ అనుభూతికి నాంది ఉమగారింట్లో డిన్నర్‌పార్టీలో జరిగింది.

సాధ్యమైనంత శ్రద్ధగా అలంకరించుకుని, ఈయన ప్రక్కన సగర్వంగా కూర్చున్నాను. ఇంతలో ఎక్కడి నుండి వచ్చిందో ఆవిడ — పేరుకూడా తెలియదు — సన్నూరికే "హలో" అని పలకరించి, ఈయనతో కబుర్లలోకి దిగిపోయింది. గంటలకుగంటలూ, విసుగు




రాకుండా చమత్కారంగా కబుర్లు చెప్పటంలో ఈయన కీయనేసాటి. నా దురదృష్టవశాన ఆయనకు అటుప్రక్క కుర్చీ ఖాళీగా ఉంది. ఆవిడ అందులో కూర్చుంది. వాళ్ళిద్దరూ నా ఉనికి నే మరచిపోయి, కబుర్లు చెప్పుకుని, నవ్వుకుంటూంటే, నా మనసు బాధతో మెలికలు తిరిగిపోయింది. నా ముందు వడ్డించిన పదార్థాలలో రుచి తెలియలేదు. అసలా పార్టీ కెందుకొచ్చానా అని కుమిలిపోయాను. కళ్ళారా చూడకపోతే, ఇంతవ్యధ ఉండేదికాదేమో? సభ్యత కోసం అతి బలవంతాన నిగ్రహించుకున్న కన్నీరు ఇంటికి రాగానే కట్టలు తెగి ప్రవహించింది.

పాపం, ఏమీ తెలియని అమాయకుడిలాగా "ఇదేమిటీ? ఎందు కేడుస్తున్నావ్?" అని అడిగాడు పైగా. అతి సునాయాసంగా జీవితమంతా నటించెయ్యగలరు!

అవమానంతో, ఈర్ష్యతో, ఏదో ప్రతీకార వాంఛతో మనసు ఉడికిపోయింది.

"ఎందు కేడుస్తున్నానా? ఇంకా బ్రతికున్నందుకు——" కసిగా అన్నాను.

పకపక నవ్వారు.

"అందుకు ఏడ్చి ఏం ప్రయోజనం?"

ఒక ప్రక్క నేను కుమ్ములో పెట్టినట్టు కుమిలిపోతుంటే ఈయనకు వెక్కిరింత! ఎలా భరించగలను?

"అవును ఏడ్చి ఏంప్రయోజనంలేదు. కొంచెం విష మివ్వండి. మీకూ నాకూ కూడా తెరిపి——"

చటుక్కున నాదగ్గరకు వచ్చి నా పెదవులు గట్టిగా ముద్దు పెట్టుకున్నారు.

ఏదో మంత్రం వేసినట్లు మనసులోని

అంతటి దుర్భరవేదనా, మంచులా కరిగి పోయింది. కోపం నిలుపుకోవాలనే నా ప్రయత్నాన్ని వెక్కిరిస్తూ నా కళ్లు నవ్వేశాయి.

"విషం! ఎలా వుందీ?" అల్లరిగా నవ్వుతూ అన్నారు.

అది విషమా? ప్రణయానికి వ్యాఖ్యానము వినిపించే, యవ్వనానికి సార్థక్యం వివరించే, ఆ మాధుర్యాన్ని దేనితో పోల్చగలను?

"పిచ్చిపిల్లా! ఇంతమాత్రానికే, ఇంత, ఇంత రాద్ధాంతమా? ఏదో ఆవిడ మాటాడిస్తే మాట్లాడాను. ఇందులో ఏంకొంప మునిగిపోయిందీ?" లాలనగా జుట్టు నిమురుతూ అన్నారు.

కొంప మునగడం అంటే ఏమిటీ? ఇంతవరకూ నే ననుభవించిన చిత్రవధ కొంప మునగడంకాదా? ఇంకా ఏమిటి? కానీ, నాకు ఆలోచించే శక్తి లేదు. నాకు తెలుస్తున్నదల్లా నన్ను లాలిస్తున్న ఆయన స్పర్శమాత్రమే! ఆయన మాటలన్నీ నమ్ముతాను.

నమ్మకపోతే ఆయనను ఆరాధించలేను.

ఆరాధించకుండా బ్రతకలేను.

నా కోసం, నా మనశ్శాంతికోసం, నా సంతృప్తికోసం ఆయన ఏం చెప్పినా నమ్ముతాను. అవి నిజాలా, అబద్ధాలా అనే ఆలోచన నా కక్కరలేదు.

"మన ప్రక్కింటి రామనాథం మాత్రం అక్కడ ఎంతమందితో మాట్లాడలేదూ? వాళ్ళ ఆవిడ ఇలాగే ఏడుస్తుందా?"

"ఎంతమాత్రం ఏడవదు. తనకు ఆ కొంచెం సేపయినా ఆయన నుండి విముక్తి లభించిందిగదా అని సంతోషిస్తుంది."

ఆయన ముఖం ప్రక్కకు తిప్పుకొని నవ్వసాగారు.

"అదీగాక, ఆవిడ కేడవాల్సిన పనేముందీ?"

"అదేమిటీ?"

"ఏమిటో నాకు మాత్రం ఏం తెలుసు? ఆయనతో మాట్లాడుతున్నప్పుడు అవతలి ఆడవాళ్ళ కళ్ళు సంతోషంతో వెలగవు. వాళ్ళ కంఠాన్ని ఏదో మార్దవం ఆవేశించదు. తమని తాము మరచి ఎంత సేపైనా అలా నిలచిపోరు. వాళ్ళ కళ్ళలోకి చూస్తూ చిలిపిగా నవ్వగలిగే సాహసం ఆయన కెంతమాత్రం కలగదు. ఇక ఆయన ఎంతమందితో మాట్లాడితేమాత్రం ఆవిడ ఎందు కేడుస్తుందీ?" వింటున్న ఆయన కళ్ళు గర్వంగా మెరిశాయి. ఆ గర్వరేఖల్ని చూసిన నాకు మంటింది. అలా మాట్లాడినందుకు నన్ను నేను తిట్టుకున్నాను. 'నా పిచ్చికానీ——, నే చెప్పకపోతే, ఆయనకు తెలియదా?'

నిజమే! రామనాథంగారి భార్యకు నాలా ఏడవాల్సిన అవసరం ఎన్నడూ రాదు. అందుకని ఆవిడ నాకంటె అదృష్ట



వంతురాలా? అల్లాంటి అదృష్టం నాకు కావాలా?

అమ్మబాబోయ్! వద్దు!! ఆ కళ్ళలోకి చూడకుండా, ఆ కబుర్లు వినకుండా, ఆ చిరునవ్వుకు పరవశించకుండా, ఒక్క రోజుకూడా ఉండలేను. దీని వెనుక ఎంతటి క్షోభ ఉన్నా సరే!

వచ్చేసింది. మెత్తని పిడుగులా, చల్లని సుడిగాలిలా అరుణ. దాని ముఖం చూసిన కొన్నిక్షణాలు తాత్కాలికంగా నా భయాలు, అనుమానాలూ మరిచిపోయి, దానిని ఆప్యాయంగా కౌగలించుకున్నాను. అరుణ వాత్సల్యంగా నా కళ్లలోకి చూస్తూ "నీ స్నేహం చాలా చల్లగా ఉంటుంది కోమలీ! నా మనసులో మంటలు చల్లార్చుకుందామని వచ్చాను," అంది. నాకెలానో అనిపించింది. కొంపదీసి దాని మనసులో మంటలు నా మనసులోకి బదిలీ అవవుకదా!

పగలంతా యధాప్రకారం అది వేళా

కోళాలతో, వెక్కిరింతలతో నవ్వుతూ, త్రుళ్ళుతూ కనిపించింది. 'దీనికి మనసులో మంట లేమిటా?' అనిపించింది. ఈయన వచ్చేవేళయింది. ఈయనను దీనికి పరిచయం చెయ్యకుండా ఉండగలిగితే బాగుండును. బోడి కల్చర్! వచ్చినట్లు పరిచయం చెయ్యాలి. పోనీ, ఇది సిగ్గుగా తల వంచుకుని లోపలకు పోతుందా? ఒక్కనాటికీ పోదు. ఏం చెయ్యాలి?

ఎంతో ప్రయత్నంమీద అరుణ కంటే, నేనే బాగుంటా నని నన్ను నేను నమ్మించుకోగలను.

అరుణ కొంచెం లావు.

నేను నాజూగ్గా ఉంటాను.

అరుణ చామనఛాయ.

నేను పచ్చని పసిమి.

అరుణ జుట్టు పల్చన.

నా జుట్టు ఒత్తుగా, వంకీలు వంకీలుగా ఉంటుంది.

ఇలా నేనే అధికురాల ననుకోవచ్చు. కాని... నాకు తెలుసు. దానిలో ఏదో ఉంది. దానిముందు నేను నిలవలేను. అందానికి అతీతమైన ఏదో ఆకర్షణ దానిది. ఒకనాడు దానిస్నేహం కోసం పడిగాపులు పడిన నా మనసే దీనికి సాక్ష్యం

సావిట్లోంచి ఘొల్లున నవ్వులు వినిపించాయి.

గబగబ వంటిట్లోంచి ఇవతలకొచ్చాను.

భగవంతుడా! ఎందుకో, ఏమిటో, ఈయనా అరుణా కలిసి పక పక నవ్వు కుంటున్నారు.

నన్ను చూస్తూనే అరుణ నా దగ్గరకు వచ్చి నవ్వుతూ, "ఎంతపని జరిగిందో చూడు! దీక్షగా పుస్తకం చదువుకుంటు న్నాను. లైటు వెయ్యటానికికూడా బద్ధకించి పుస్తకం గుండెలమీద ఉంచుకుని సోఫాలో వెనక్కువాలి అలానే కూర్చు న్నాను. అకస్మాత్తుగా వెనక్కి తిరిగి చూద్దునుకదా! _ ఈయన!


"అయామ్ వెరీ సారీ! కోమలి అనుకున్నాను. అందుకనే స్వతంత్రంగా తలలో పూవులు పెట్టాను. మరోలా భావించకండి,' అన్నారు.

"అంతవరకూ నాకాయన తలలో పువ్వులు పెట్టినట్లుకూడా తెలియదు. అంత పరధ్యానంలో ఉన్నాను. ఇంద, నీ పువ్వులు నువ్వు తీసేసుకో,'' అంటూ తలలోంచి పువ్వులు తియ్యబోయింది.

నా తల గిఱ్ఱున తిరగసాగింది. ప్రళయం అప్పుడే ప్రారంభమయింది.

"వద్దు వద్దు! నీ తల్లోంచి తియ్యకు. అవి నా కక్కర్లేదు," అంటూనే అక్కడ నిలవలేక లోపలికి వచ్చేశాను. అరుణ కూడా నాతోపాటే లోపలకు వచ్చింది. అరుణను ఆయనకు నేను పరిచయం చెయ్యలేదు.

ఇంక ఆ అవసరంలేదు.




నన్ను నేను నిగ్రహించుకొని అరుణతో మామూలుగా మాట్లాడడానికి చాలా సేపే పట్టింది. అంతవరకూ అరుణ కూడా నన్ను పలకరించలేదు. దాని ఆలోచనలలో అది ఉంది.

అందరం భోజనాలకు కూర్చున్నాం. సాధారణంగా భోజనాలదగ్గిర అదీఇదీ మాట్లాడుకోవడం అలవాటు. నా కేమిటో ఏమీ మాట్లాడా లనిపించలేదు. అరుణను గురించి ఈయనకు చెప్పటం నాకిష్టం లేదు.

"మీ రివాళే వచ్చారనుకుంటాను;" ఈయన సంభాషణ ప్రారంభించారు.

"అవును, ప్రొద్దున్న పదిగంటలకు వచ్చాను."

"ప్రయాణం సుఖంగా జరిగిందా? దగ్గిరే కదూ?"

"దగ్గిరేమిటండీ? ఎక్కడో కాశ్మీర్ నుంచి వస్తేను!"

'కాశ్మీరా! వాట్ ఎ లవ్లీ ప్లేస్ కొండలమీదుగా వాలుగా ఉన్న రోడ్లూ, రెండుప్రక్కలా వింతవింత చెట్లూ, రకరకాల పువ్వులూ ... నడుస్తూంటే చాలా హాయిగా ఉంటుందండీ!"

"అవును, మంచి కంపెనీ ఉంటే ఇంకా బాగుంటుంది. శీతాకాలం అందరూ చలి అంటారుకానీ, నాకా మంచు కురుస్తున్నప్పుడే ఇంకా బాగుంటుంది."

"అవును, అప్పుడే బాగుంటుంది. సరిగ్గా మంచు కురుస్తున్నప్పుడు చూడాలి– ఆ ప్రకృతి సౌందర్యానికి మెచ్చి దేవతలు పుష్పవర్షం కురిపిస్తున్నారా అన్నట్లుంటుంది. ఆ మంచులో స్కేటింగ్—మహాసరదాగా ఉంటుంది."

ఈయన ఎప్పుడూ కాశ్మీర్ వెళ్ళ లేదు. వెళ్ళాలనే ఆలోచనకూడా లేదు ఈ సంభాషణ ఇంక వినే ఓపిక నాకూ లేదు. చటుక్కున నా కంచంలో చెయ్యి

కడి॰ సుకుని లేచిపోయాను.

అరుణ గాభరాగా "అదేమిటి? అలా మధ్యలో లేచిపోయావ్?" అంటూ తనూ లేవబోయింది.

ఈయన అతిగంభీరంగా, "దాని కీ మధ్య ఒంట్లో బాగుండటం లేదులెండి. వెళ్ళి విశ్రాంతి తీసుకోనియ్యండి. ఏమీ పలకరించకండి," అన్నారు.

"ఏమైనా విశేషమా?" నవ్వుతూ అడిగింది అరుణ.

"అన్నీ విశేషాలే!" ఆయనా నవ్వారు.

అరుణ కూర్చుండిపోయింది.

ఎంత వినకూడదనుకున్నా నాకు వాళ్ళ నవ్వులు వినిపిస్తూనే వున్నాయి. జరిగినవి పదినిముషాలో, పదిహేను నిముషాలో అయినా, నాకు పదిహేను యుగాలు గడిచినట్లుగా అనిపించింది.

ఇంచుమించు గంట తర్వాత ఈయన పడకగదిల్లోకి వచ్చారు.

"వంట్లో ఎలాఉందీ?" చాలా గాభరాగా అడిగారు.

ఎంత ప్రేమ!

కోపంగా మంచంమ్మీంచి లేవబోయాను.

"వద్దు!...వద్దు! లేవకు. వంటిల్లంతా, పాపం, అరుణగారు సర్దేశారు. ఏవేవి ఎక్కడ పెట్టాలో నేను చెప్పాననుకో; నువ్వు విశ్రాంతి తీసుకో. నేను పైన డాబామీద పడుకుంటాను,'' అంటూనే పక్కచుట్ట తీసుకుని పైకి వెళ్ళిపోయారు.

"నాకు వంట్లోబాగుండలేదా? అవును! తల పగిలిపోతూంది, కళ్ళు మండిపోతున్నాయి! మనసు ఆలోచించే శక్తిని కోల్పోంతూంది.

కానీ నాకు కావాల్సిన విశ్రాంతి ఇదా? ఈయన అలా పైకి వెళ్ళిపోతే నాకు స్వస్థత చేకూరుతుందా?

ఎంత ప్రయత్నించినా నాకు నిద్ర రాలేదు. నిద్ర లేమితో కళ్ళు భగ్గున మండుతున్నాయి; కానీ కునుకు పట్టించుకోలేకపోతున్నాను. పన్నెండు కొట్టడం విన్నాను. ఒంటిగంట...

ఉన్నట్లుండి నా మనసు నొక భయంకరమైన అనుమానం ఆవరించుకుంది. గబగబా బయటకు వచ్చి చూశాను. హాల్లో తన బెడ్డింగు పరచుకుని పడుకొనిఉంది అరుణ. బెడ్‌లైట్ వల్చని కాంతిలో నిద్రపోతున్న అరుణ ముఖం పసిపిల్లల ముఖంలా అమాయకంగా కనుపించింది. అనవసరంగా నన్ను నేను క్షోభపెట్టుకుంటున్నానా అనిపించింది. పైకి వెళ్ళాను. ఈయన ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నారు. ఏ తిథో తెలియదుకానీ చంద్రుడు సగమే వున్నాడు. వెన్నెల మసకగా ఉంది. ఆ మసక వెలుతురులోకూడా అందంగా కనిపించే ఆ ముఖాన్ని చూస్తూ అలా కూర్చోవాలనిపించింది. నిద్రలోకూడా చెరగని




ఆ క్రాఫింగుని నా చేతులతో చిందర వందర చేసెయ్యా లనిపించింది.

ఆయనకు ఎక్కడ మెలకువ వస్తుందో నని భయపడుతూనే పాదాలదగ్గిర తల పెట్టుకుని పడుకున్నాను. ఆ కాస్తకే ఆయన లేచిపోయారు.

"నిద్రపోలేదా!" ఆశ్చర్యంగా అన్నారు.

తల వంచుకున్నాను——

నవ్వి చేతులు జాపారు. హృదయం మీద వాలిపోయాను. భూత భవిష్యత్తులను మరచి హాయిగా నిద్రపోయాను.

సూర్యుడి కిరణాలు నా కళ్ళని పొడుస్తూంటేకాని మెలకువ రాలేదు. అంత పొద్దుపోయేవరకూ పడుకున్నందుకు సిగ్గుపడుతూ, పనిమనిషన్నా లేపనందుకు ఆశ్చర్యపడుతూ క్రిందకు వచ్చాను. ఈయనా, అరుణా ఏవో కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు త్రాగుతున్నారు. ఆ దృశ్యం చూడలేకపోయాను. నన్ను చూడగానే అరుణ లేచి నాదగ్గరకు వచ్చి ఆప్యాయంగా "వంట్లో ఎలా ఉందీ? రాత్రి నలతగా ఉన్నావని లేపలేదు. నేనే కాఫీ చేసి మీ శ్రీవారికి ఇచ్చాను. పాపం నీ చేతి కాఫీలా ఉండదనుకో! అయినా కష్టపడి తాగుతున్నారు——" అంది.

"నో, నో!! కోమలి చేసిన దానికంటేకూడా చాలా బాగుంది;" వెంటనే అన్నారాయన. అలా అనడం సభ్యత. ఈ సభ్యతను నాలుగు ముక్కలుగా చీల్చిపారెయ్యాలనుంది. దొడ్లోకి వచ్చేశాను. ఎదురుగా పనిమనిషి రంగమ్మ కనిపించింది. దానిమీద విరుచుకుపడ్డాను.

"ఏమే. నీ నోరు ఏమైంది? వచ్చిన దానివి నన్ను లేపక్కర్లేదా? రేపొద్దున ఏదైనా పోతే ఎవరి నడగను? నీ పనీ వద్దు - నువ్వూవద్దు; ఇంట్లోంచి పో!" అది బెదిరిపోయింది.

"అంట్లెయ్యడానికి మిమ్మల్ని కేకేశా నమ్మగోరూ! అయ్యగోరు మిమ్మల్ని లేపవద్దని ఆరే ఏసేశారు."

"అరుణమ్మగారు కాదా?" గొంతు తగ్గించి అడిగాను.

"బాబుగా రేస్తావుంటే అప్పు డాయమ్మొచ్చి నే నేస్తానని ఏశారు."

వంటపొయ్యిలో ఇన్ని నీళ్ళు పోసి కళ్ళు మూసుకు పడుకోవాలన్నంత విసుగ్గా వుంది. మళ్ళా అది ఏ ఉపద్రవానికి దారితీస్తుందోనని నా ఉద్వేగాన్నంతా అణచుకుంటూ ప్రశాంతంగా ఇంటిపనులు మొదలుపెట్టాను. ఆనాడాదివారం. ఈయన ఇంట్లోనే ఉన్నారు. అరుణ నా కూడా తిరుగుతూ వంటింట్లోనేఉంది. ఇది కాస్త నా ప్రాణానికి తెరిపిగా వుంది. కానీ సాయంత్రానికల్లా మళ్ళీ ఉప్పెన వచ్చిపడింది.


"నేను సాధారణంగా తెలుగు సినిమాలు చూడడం పడదు. ఈ ఊళ్ళో దేవదాసు మళ్ళీ వచ్చిందట. నా కది చూడాలని ఉంది. వెళ్దామా?" అంది అరుణ.

ఈయన తెలుగు సినిమాలకు రారు. నాకూ దేవదాసు చూడాలనే ఉంది. "సరే," నన్నాను.

ఇద్దరమూ తయారయి వచ్చేసరికి ఈయన "ఎక్కడకీ?" అన్నారు.

"తెలుగు సినిమాకి," అన్నాను.

"నేనూ వస్తాను. నాకు వేరే పనేం




లేదు," అంటూ లేచారు. ఎన్నిసార్లు నేను బ్రతిమాలుకున్నా 'వెధవ తెలుగు సినిమాలు,' అని తిట్టిన పెద్దమనిషి! నాకు ఒళ్ళు మండిపోయింది.

"ఇంతవరకూ మీరు తయారవలేదు. టైమయిపోయింది. మీకు పెద్ద ఆసక్తి లేదుకదా!" అన్నాను.

"ఎంత! రెండు నిముషాల్లో తయారయి వచ్చేస్తాను," అంటూ లోపలి కెళ్ళిపోయారు.

ఆయన ఉత్సాహంగా బైలుదేరుతున్న కొద్దీ ఈ ప్రయాణం ఎలాగయినా ఆపు చెయ్యాలని పట్టుదల హెచ్చింది నాలో. ఈయన తయారయి రాగానే సోఫాలో కూలబడి "నా కళ్ళు తిరుగుతున్నాయి. తలంతా భారంగా ఉంది. నేను రాలేను," అన్నాను.

అరుణ వెలవెలపోతూ మా ఇద్దరి వంకా చూసింది.

"నీకసలు రాత్రినుంచే బాగుండలేదు. విశ్రాంతి తీసుకోమంటే విన్నావా? ఇవాళ్ళంతా శ్రమపడ్డావు. సరే! నువ్వు పడుకో! అరుణగారిని నేను తీసికెళ్తాను;" ఎంతో మామూలుగా అన్నా రాయన.

నాకు మతిపోయినట్లయింది.

"కోమలి రాకుండా నేనెందుకూ? నేనూ ఇంట్లోనే వుంటా,"నంది అరుణ.

"ఇంతా తయారయి చివరకు మాను కోవడం దేనికి? బయలుదేరండి. దానికి కొంచెం సేపట్లో సర్దుకుంటుందిలెండి. ఇవాళ ఆఖరిరోజు కూడా!" తొందర చేశా రాయన.

"వెళ్ళమంటావా?" నన్నడిగింది అరుణ.

భగవంతుడా! ఈ ప్రశ్న అడగవలసింది నన్నా?

ఏం సమాధానం చెప్పను?

"వెళ్ళిరా," కటువుగా అన్నాను. నా స్వరంలో కాఠిన్యం దాని కర్థమవుతుం దనుకున్నాను. కాని దాని హృదయ

కాఠిన్యం ముందు నా స్వర కాఠిన్యం ఓడి పోయింది.

"సరే అయితే! నువ్వు మాత్రం అనవసరంగా శ్రమపడక విశ్రాంతి తీసుకో!" అంది వికసించిన ముఖంతో.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. ఎంత మాత్రం వెళ్ళడానికి వీల్లేదని గట్టిగా అరుద్దామనుకున్నాను. నేను కూడా వెళ్ళ నందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

విశ్రాంతి! విశ్రాంతి!! నాకు శాశ్వత మైన విశ్రాంతి ఎప్పుడో!!!

ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో కరువు తీరా ఏడ్చేశాను. కొంత గుండె బరువు తగ్గింది. ఇంక అరుణతో ఏదో విధంగా స్పష్టంగా చెప్పెయ్యాలి! 'చిచ్చొడిం గట్టినయట్లు' — అరుణను నేను భరించలేను.

అలా ఎంత సేపుండిపోయానో నాకే తెలియదు. తలుపుతట్టిన చప్పుడుకు వెళ్ళి తలుపు తీశాను. ఈయన లోపలికి వచ్చారు. ఆశ్చర్యంగా "అరుణేదీ?" అన్నాను.

"ఆవిడ అప్పుడే ఎలా వస్తారూ? తెలుగు సినిమా పదింటికి కాని కాదని తెలియదా? ఇప్పుడు ఎనిమిదే అయింది."

"మరి మీరు—!"

"ఆవిడను దేవదాసులో దింపి నేను కొంచెంసేపు స్నేహితుడింట్లో కూర్చుని వచ్చాను. వచ్చేటప్పుడు రిక్షాలో వచ్చేస్తా నన్నారు."

ఆయనవంక అలా చూస్తూ నిలబడి పోయాను.

"నీ తలనొప్పి ఇంకా ఎక్కువయి పోయినట్లుందే? కళ్ళుకూడా వాచాయి; ఎర్రబడ్డయి. డాక్టర్ దగ్గిరకి తీసికెళ్ళనా?"

ఆ కళ్లు అల్లరిగా నవ్వుతున్నాయి. తలవంచేసుకున్నాను. మనసెంతో తేలికయింది.

"నాకు అన్నం పెట్టగలవా? పెట్టు కోనా?"

"అరుణ—?"

"ఇన్ని పనులు స్వతంత్రంగా చేసి నావిడ అన్నం పెట్టుకు తినలేదూ? నిన్ను పడుకోమని మరీమరీ చెప్పారు."

"రండి," అన్నాను.

ఒక్కసారి అద్దంలో నన్ను నేను చూసుకున్నాను. కళ్లు బాగా ఉబ్బి వున్నాయి. జుట్టంతా రేగిపోయింది. కట్టు కున్న చీర బాగా నలిగిపోయింది. త్వరగా బాత్‌రూం కెళ్ళి ముఖం కడుక్కుని, బొట్టు పెట్టుకుని, బట్టలు మార్చుకుని వచ్చాను.

అప్పటికి ఈయనే మా కిద్దరికీ కూడా వడ్డించారు. నేను నొచ్చుకుంటూ "నేను వస్తున్నానుకదా! ఎందుకా తొందర?" అన్నాను.

"ఇంతలో నీ పాతివ్రత్యాని కేమీ భంగం రాలేదు కానీ కూర్చుందూ;" నవ్వుతూ అన్నారు. ఆ నవ్వులో ఎక్కడి మనస్తాపా లక్కడ కొట్టుకుపోయాయి.



సుఖంగా నిద్రపోయాను. ఏదో గడబిడకు మెలకువ వచ్చింది. ఈయన గొంతూ, అరుణగొంతూ వంటింట్లోంచి వినిపిస్తూంది. గబగబ వంటింట్లోకి వెళ్లాను. అరుణ అన్నం తింటూంది. ఈయన ఎదురుగా కూర్చుని ఏదో మాట్లాడుతున్నారు. నన్ను చూడగానే అరుణ "అరె! మెలకువ వచ్చేసిందే!" అంది.

"ఏం? బాధగా ఉందా?" కటువుగా అన్నాను.

ఈయన అందుకున్నారు.

"బాధకాదూ? నీకు శ్రమ ఇయ్యకూడదని, నిన్ను లేపకుండా, పెట్టుకుంటూంటే. నువ్వు లేచిపోతే ఎలా ఉంటుంది?''

లోలోపల పళ్ళు నూరుకున్నాను.

అరుణ నా వేపు విచిత్రంగా చూసి, మౌనంగా భోజనం ముగించింది.

ఆ మరునాడు ఈయన వెళ్ళిపోయిన తరువాత అరుణతో సంభాషణ ప్రారంభించాను.

"నువ్వు ప్రకాశాన్ని పూర్తిగా మర్చిపోయినట్లేనా?

అరుణ ముఖం గంభీరంగా మారిపోయింది.

"ఆ ప్రసక్తి దేనికిప్పుడూ?" విసుగ్గా అంది.

అరుణ ప్రకాశాన్ని ఏనాటికీ మరచిపోలేదనీ, ఆ ప్రస్తావన తెస్తేగాని మనసులోని బెరడుగట్టిన పుండును రేపినదాన్నవుతాననీ నాకు తెలుసు. కానీ— ఎందుకో దాని మనసు నొప్పించాలనుంది.

"అతడి నంతగా ప్రేమించికూడా, నువ్వెందుకు పెళ్ళిచేసుకోలేదూ? నీకంటే ముందే అతను రేవతిని పెళ్ళిచేసుకుంటా

నని మాట ఇచ్చాడన్న సంగతి తెలిసి కదూ! ఆ కోపంకొద్దీ నువ్వు పోయి కావాలని మూడోపెళ్ళివాడిని చేసుకున్నావు. అత నేమో యీనాటికీ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. చివరకు ఇద్దరికీ ఆవేదనే మిగిలింది. ఇంతటి అనర్థానికీ కారణం నీ అసహనమే కదూ! మనం ప్రేమించేవాళ్ళకోసం ఏమైనా చెయ్యగలం. ఎంతైనా వదలుకోగలం. కానీ వాళ్ళు మరొకళ్ళను ప్రేమించడం మాత్రం సహించలేం. అవునుకదూ!'' నా మాటలకు అరుణ బాధపడుతుం దనుకున్నాను.

కానీ పకపక నవ్వసాగింది!!

"ఎందుకు నవ్వుతున్నావ్?" అన్నాను కోపంగా.

"నువ్వు చిన్నపిల్లలు 'అమ్మా – నాన్నా' ఆట ఆడుకోవటం ఎప్పుడైనా చూశావా? నాన్నగా ఉండేపిల్ల, 'బజారు కెడుతున్నాను. తలుపేసుకో,' అంటుంది. అమ్మగా ఉండేపిల్ల 'త్వరగా రండి. వచ్చేటప్పుడు కూరలు తెండి. రేపటికి లేవు,' అంటుంది. ఇద్దరికీ అది ఆటని తెలుసు. అయినా ఇద్దరి కిద్దరూ అత్యంతాసక్తితో, ఎంతో గంభీరంగా ఆమాటలంటారు. ఈ ప్రేమ కూడా మన కందరకీ వచ్చి అబద్ధమని తెలిసే, మన మేమీ విలువ ఇయ్యటం లేదని అర్థమయీ, అత్యంతాసక్తితో మనమంతా ఆడుకునే ఆహ్లాదకరమైన ఆట! అంతే!!"

తెల్లబోయి దాని ముఖం వంక చూడడంకంటే మరి ఏమీ మాట్లాడలేక పోయాను.

ఆరోజే అది ప్రయాణమయింది.

ఎక్కడ ఉండిపోతుందో నని భయపడుతూనే, "ఇంకా రెండురోజు లుండ రాదూ?" అనకుండా ఉండలేకపోయాను. కానీ అది నా మాట వినిపించుకోకుండా బయలుదేరింది. "మీ ఆయనకు స్వయంగా చెప్పలేకపోయాను. వెళ్ళానని చెప్పు," అంది.

తీరా అది రైలెక్కే సమయానికి నా కళ్ళలో నీళ్లు తిరిగాయి. అది నవ్వుతూ నా కళ్లు తుడిచింది కాని దాని కళ్ళలోనూ నీళ్లున్నాయి. అన్నీ ఉన్న అభాగ్యురాలు అరుణ! పాపం! అదేదో మనశ్శాంతి కోరి నా దగ్గిరకి వస్తే, నేను దానికి మరింత అశాంతి నిచ్చానేమో? నే నేం చెయ్యగలను?

అరుణ వెళ్ళి వారంరోజు లయింది. ఆ రోజు దాని దగ్గిరనుండి ఉత్తరం వచ్చింది. పనిహడావుడిలో చదవలేక దాన్ని డ్రాయరులో పడేశాను. రాత్రి వంటకూడా పూర్తయింది. ఎనిమిదయినా ఈయ నింకా రాలేదు. బహుశః కామేశ్వరావుగా రింటి కెళ్ళిఉంటారు. వాళ్ళ శైలజ ఈయన్ని త్వరగా రానిస్తుం దేమిటీ? ఏం తోచక చికాకుగా ఉన్న నాకు అరుణ ఉత్తరం గుర్తు కొచ్చింది. ఆసక్తితో విప్పాను.

"డియర్, కోమలీ!

నీ ఆప్తమిత్రురాలిగా నీ వ్యక్తిగత విషయాలలో కలగజేసుకునే అధికారం నా కుంది. అందుకనే స్వతంత్రంగా కొన్ని విషయాలు వ్రాస్తున్నాను. నే నున్న నాలుగు రోజులలో నువ్వు పొందే ఆవేదనను అర్థం చేసుకున్నాను. అల్లాంటి అవేదన కలగడం సహజ మని నాకూ తెలుసు. కానీ నిన్ను నువ్వలా హింసించుకోవడంలో ఏం ప్రయోజనం లేదు. ఎక్కడ గ్లామ రుంటుందో అక్కడ జనం పోగవుతారు. ఇది తప్పదు. తమ భర్త గ్లామరస్‌గా ఉండా లని వాంఛించే స్త్రీలు తరువాత అతని చుట్టూ మూగే జన సమూహాన్నికూడా సహించగలిగి ఉండాలి. చంద్రుడి కాంతిలా, పిల్లతెమ్మెర చల్లదనంలా, అరుణకాంతుల అందాలలా, కొందరు వ్యక్తులను ఒక పరిధిలో బంధించడం అసాధ్యం... సాధారణంగా అలాంటి వాళ్ళల్లోనే సర్వజన సమ్మోహనకర మైన ఏదో అసాధారణాకర్షణ ఉంటుంది. నువ్వు సాధారణమైన వ్యక్తిని చేసుకుని ఉంటే నీ జీవితం అతి మామూలుగా ఉండేది. నీకీ ఆవేదనా ఉండేదికాదు. కానీ – నువ్వు ఏరికోరి ఆ అసాధారణ మైన ఆకర్షణనే వరించావు. నిన్ను మైమరపించిన ఆ ఆకర్షణ, అట్లాంటి ప్రభావమే ఇతరులమీదా చూపుతుందని గ్రహించాలి. ఈ కారణంగా నీ మనస్సుని క్షోభపెట్టుకున్నావంటే ఇంకా నీకు విముక్తి ఉండదు. నీ కోసం, నీ సంతోషంకోసం, నీ సౌఖ్యంకోసం చెపుతున్నాను. దీని నొక సామాన్యమైన విషయంగా తోసిపారెయ్యి. ఇది చాలా కష్టమని నాకూ తెలుసు. కాని ఇందుకే నువ్వు ప్రయత్నించక తప్పదు. నీ భావం నా కర్థమయింది. నా కత్యంత ఆత్మీయు రాలివి నువ్వు. నీ మనస్సు నొప్పించ లేను. అందుకే వెళ్ళిపోయాను; బహుశః మళ్ళీరాను. కానీ అంతతో నీ ఆవేదనతీరుతుందా? మరో రకంగా అది ఎలానూ ఉంటుంది. 'భార్యా రూపవతీ శత్రుః' అన్నారు కానీ 'భర్తా రూపయుతశ్శత్రుః' అనికూడా అనాలేమో అనిపిస్తూంది. కానీ ఇలా మనం ఆరాధించే ఆ రూపాన్నే మనకు శత్రువుగా తయారుచేసుకుంటే ఎలా. అయస్కాంతం ఇనుముని ఆకర్షించడం ఎంత సహజమో, రూపం పరిసర వ్యక్తుల్ని ఆకర్షించడంకూడా అంతే సహజం. అత్యంత సహజమైన యీ విషయాన్ని అతి సామాన్యంగా తీసుకోవాలి. ఇది ఎంత కష్టమయినా నువ్వు సుఖపడాలంటే, దీనిని సాధించక తప్పదు.

నీ

అరుణ.